క్లుప్తంగా

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రాజెక్టుకు బహుమతి



గుంటూరు ఎడ్యుకేషన్: యూఎస్ఏలోని నాసా నిర్వహించిన స్పేస్ కాంటెస్ట్–2024లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు సంస్థ ఏజీఎం డాక్టర్ సూత లపాటి అంజయ్య తెలిపారు. రింగు రోడ్డులోని కార్యాలయంలో శనివారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. శ్యామలానగర్ క్యాంపస్ విద్యార్థులు మాదాల రిత్విక్‌రెడ్డి, పోగోలు హర్షితప్రియ, వడ్లమూడి మహేశ్వరి, సయ్యద్ అర్షియా సుల్తానా, మారెళ్ల జశ్వి శ్రీకీర్తి ప్రియ, వజ్రాల దాక్షిణ్యరెడ్డి సంయుక్తంగా రూపొందించిన ఎంపీరియన్ ప్రాజెక్టు జాతీయస్థాయిలో ప్రోత్సాహక బహుమతికి ఎంపికైనట్లు చెప్పారు. 28కు పైగా దేశాల నుంచి విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో రాష్ట్రం నుంచి పోటీ పడిన శ్రీచైతన్య విద్యార్థులు వరుసగా 11వ సారి చాంపియన్లుగా, గుంటూరు జోన్‌లోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త సచ్చిదానందమూర్తి, ప్రిన్సిపాల్ అరుణ, డీన్ శివప్రసాద్, నాసా ఇన్‌చార్జ్ సుమతి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

గుంటూరు రూరల్: ఇరువర్గాల మధ్య వివాదం నేపథ్యంలో ప్రత్యర్థిపై మద్యం సీసాలతో దాడిచేసిన వ్యక్తులను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి అమరావతిరోడ్డులోని ఒక బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవిస్తున్న మణికంఠస్వామి అనే వ్యక్తిని చిల్లర కిషోర్, విజయకిషోర్, పి.రమేష్, వెంకటేష్ అనే నలుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన సంఘటనలో బాధితుడు మణికంఠస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ




గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బెంగళూరుకు చెందిన మెడిఅసిస్ట్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. సంస్థ వారితో ఏడాదికి రూ 2.6 లక్షల వేతనం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

వాహనాల విస్తృత తనిఖీలు



మంగళగిరి: మంగళగిరి రూరల్ పరిధిలో పలుచోట్ల రూరల్ పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, తాయిలాలు రవాణా కాకుండా వాహనాలను తనిఖీ నిర్వహించినట్లు సీఐ వెంకటరావు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి నగదు, ఏవైనా వస్తువులు రవాణా చేస్తే కేసు నమోదు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో పలుచోట్ల కార్లు, ద్విచక్ర వాహనాలు తనిఖీలు చేశారు. తనిఖీలలో ఎస్ఐ క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

టేస్టీ సేమియా.. ఈద్ ప్రత్యేకం



పొన్నూరు: రంజాన్ ప్రత్యేకం అనగానే గుర్తుకొచ్చేది సేమియా. పండుగరోజు వంటకాలలో ముస్లింలు ప్రత్యేకంగా ఖీర్ (పాయసం), షీర్ కుర్మా తదితర రుచికరమైన స్వీట్లు తయారు చేస్తారు. గోధుమలతో సన్నని దారం పోగులను తలపించే సేమియాను తయారు చేసి విక్రయించడంలో పట్టణంలోని చాందినీ చౌక్ సెంటర్ పేరుగాంచింది. ముఫ్తీ ముజమ్మిల్ ఆజాదీ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో నిత్యం వందల కిలోల సేమియా తయారు చేస్తుంటారు. పలువురు ముస్లింలు ఇళ్ల వద్దే సొంతంగా తయారు చేసి విక్రయిస్తుంటారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి పెట్టండి

- నగర కమిషనర్, తూర్పు ఆర్వో కీర్తి చేకూరి
- మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి ఆదేశించారు. పనుల్ని మూడు రోజుల్లో పూర్తి చేయాలని గడువు పెట్టారు. తన చాంబర్‌లో శనివారం ఏఆర్‌ఓలు, ఇంజినీరింగ్, ఎన్నికల విధులు కేటాయించబడిన సూపరింటెండెంట్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, ఓటర్ల రాకపోకలకు వీలుగా బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాల కల్పనపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. మూడు రోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని, ఈఈ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు సంబంధించి అవసరమైన రిపోర్ట్‌లు ఏరోజుకి ఆరోజే పంపాలని తెలిపారు. నగర ప్రజలకు ఓటు పై అవగాహన కల్గించేలా, పోలింగ్ శాతం పెరగడానికి తీసుకోవాల్సిన చర్యలపై బీఎల్‌ఓలకు, పోలింగ్ నిర్వహణపై అధికారులకు త్వరలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈవీఎంల కమిషనింగ్ కేంద్రంలో విద్యుత్, పార్టిషన్, మార్కింగ్ వెంటనే పూర్తి చేయాలని డీఈఈని ఆదేశించారు. వాహనాలు, ర్యాలీలు, ప్రచార సభలకు మంజూరు చేసిన అనుమతులపై, ఎక్స్‌పెండిచర్ కమిటీ వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఎవరికీ మినహాయింపు లేదని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్ని సెక్టోరల్ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఏఆర్‌ఓలు నియోజకవర్గంలో ర్యాండంగా కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని ఆమె సూచించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, వెంకట లక్ష్మి, సెక్టోరల్ అధికారి, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఈఈలు సుందరరామిరెడ్డి, ఎక్స్‌పెండిచర్ టీం గని, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎస్ఎస్‌లు, డీఈఈలు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఎస్‌బీఐ ముందంజ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, శ్రీనివాసాచార్యులు తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, గుంటూరు మాడ్యూల్ ఆధ్వర్యంలో స్థానిక నగరంపాలెంలోని మెయిన్ బ్రాంచి ఏటీఎం వద్ద ఏర్పాటు చేసిన చల్లని తాగునీరు, మజ్జిగ చలివేంద్రాన్ని ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్. శ్రీనివాసరావు, గుంటూరు మాడ్యూల్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.శ్రీనివాసాచార్యులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎస్‌బీఐ ముందుంటుందని తెలిపారు. వేసవిలో పాదచారులు, వాహనచోదకులకు మండుటెండలో దాహార్తిని తీర్చే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. వేసవి కాలం మొత్తం చల్లని తాగునీరు, మజ్జిగ పంపిణీని కొనసాగిస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులతో పాటు యూనియన్ నాయకులైన ఏజీఎస్‌లు కోటిరెడ్డి, నరేంద్రకుమార్, అసిస్టెంట్ కోశాధికారి రంగసాయి, ఇబ్రహీం, కృష్ణమోహన్, రాజశేఖర్, సంపత్‌కుమార్, ఖలీల్, కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటుకూరు బైపాస్ హైవేలో నగరానికి చెందిన చేరెడ్డి మోహనరావు(52) పూల వ్యాపారం చేస్తుంటాడు. ఆటోలో పూల బస్తాలను హైవే పక్కనే దించి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో చిలకలూరుపేట వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి మోహనరావును ఢీకొంది. సంఘటనలో తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటన విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని కొడుకు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్రోధినామ సాహితీ వసంతోత్సవానికి సన్నద్ధం

- 27వ వసంతంలోకి సాహితీ సమాఖ్య
- ఉగాది నాడు విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ వసంతోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న సంస్థ సభ్యులు
- ఒకే వేదికపై 26 ఏళ్లుగా వివిధ రంగాల్లో ప్రముఖులకు సత్కారం
- ఇప్పటి వరకు 270 మందికి పైగా పురస్కారాలు
- సాహిత్యాభిమానుల ప్రశంసలు



ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పాత గుంటూరు: సాహిత్యంతో సమాజంలో ఎంతటి మార్పునైనా తీసుకురాగలమనే లక్ష్యంతో నగరంలో సాహితీ సమాఖ్య సంస్థ స్థాపించబడింది. 1997లో సాహిత్యాభిమాని ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ వ్యవస్థాపక కార్యదర్శిగా మిత్ర బృందంతో కలిసి నెలకొల్పారు. ప్రతి ఏడాది ఉగాది రోజున 'సాహితీ వసంతోత్సవం' పేరుతో విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత 26 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కలిగిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేస్తూ సత్కరిస్తున్నారు. ఇప్పటి వరకు 270 మందికి పైగా సుప్రసిద్ధ కవులు, కవయిత్రులు, కార్టూనిస్టులు, గురుస్వాములు, యువ కవులకు పుర స్కారాలు అందించారు. సినీ ప్రముఖులు కె. విశ్వనాథ్, గుమ్మడి వెంకటేశ్వరరావు, గొల్లపూడి మారుతీరావు, సింగీతం శ్రీనివాసరావు, చంద్రబోస్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, అనంత శ్రీరామ్, వేటూరి సుందరరామ్మూర్తి, మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు, పాపినేని శివశంకర్, వాడ్రేవు చిన వీరభద్రుడు, కొలకలూరి ఇనాక్, గోరటి వెంకన్న, అందెశ్రీ , వరంగల్ శ్రీనివాస్... ఇలా ఎంతోమందికి ఈ పురస్కారాలు వరించాయి.

సభా ప్రాంగణం ముస్తాబు

గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ సమాఖ్య ఉగాది పండుగ రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి సాహితీ వసంతోత్సవ సభను నిర్వహిస్తుంది. పండుగకు ప్రతీకగా ప్రాంగణాన్ని, వేదికను తీర్చిదిద్దుతారు. మామిడి తోరణాలు, అరటి బోదెలు, కొబ్బరి ఆకులు, రకరకాల పూలతో వేదికను అలంకరిస్తారు. సభకు వచ్చే అతిథులంతా సంప్రదాయ దుస్తులతో హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగ పఠనం తర్వాత సాహితీ సమ్మేళనం, అతిథుల ఉపన్యాసాలు, పుస్తకావిష్కరణలు, పురస్కార ప్రదానాలు, కవితా ప్రదర్శనలు రాత్రి పది గంటల వరకూ కొనసాగుతాయి.

అందరూ ఆహ్వానితులే..

సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకుని 27 వసంతాల సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంప్రదాయ వస్త్రధారణతో సభలో పాల్గొనాలని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ, నాద స్వర కచేరి, వేద పఠనం, పంచాంగ శ్రవణం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సభకు కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాద్, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ సినీ రచయిత చంద్రబోస్‌కు క్రోధి నామ ఆత్మీయ సత్కారం, సుప్రసిద్ధ పండితులు అవధాని డాక్టర్. ధూళిపాళ మహాదేవమణికి క్రోధినామ సాహితీ పురస్కారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జరిగే సాహితీ సమ్మేళనంలో సాహిత్యాభిమానులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కార్యదర్శి ఆర్. రాము, రవి శ్రీనివాస్, టీయంబీ ట్రస్ట్ కార్యదర్శి పి. రామచంద్రరాజు పాల్గొని ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

ఏపీ రైతు సాధికారసంస్థ ఎన్ఎఫ్ఏ ఉమాదేవి



నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేసిన రైతులతో రైతు సాధికార సంస్థ ఎన్ఎఫ్ఏ ఉమాదేవి

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించటంతోపాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని ఏపీ రైతు సాధికారసంస్థ ఎన్ఎఫ్ఏ ఉమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో రైతు వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో నవధాన్యాలు పండిస్తున్న రైతులు, సేంద్రియ వ్యవసాయ చేస్తున్న రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆశయంతో రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ ద్వారా ఒక వినూత్న పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే ఈ లాభసాటి వ్యవసాయం భూసార పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగల శక్తి ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని చెప్పారు. విష రసాయన రహిత ఆహార ఉత్పత్తులను సమాజానికి అందించవచ్చన్నారు. గత రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి కావలసిన ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారయ్యే ఉత్పత్తులు, ఇతర వస్తువులు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి రైతులతో నడిపించే షాప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రపంచ దేశాలు ప్రకృతి వ్యవసాయ విధానం వైపు ఆకర్షితమవుతున్నాయని చెప్పారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధి ఝాన్సీలక్ష్మి, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం' విజయవంతం చేద్దాం

పెదనందిపాడులో మేమంతా సిద్ధం పోస్టర్ల పంపిణీ



ఇంటింటికి తిరిగి పోస్టర్‌లను అందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఖాశీంపీరా, నాయకులు

కాకుమాను: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేము సిద్ధం బస్సు యాత్ర విజయవంతం చేయడానికి పెదనందిపాడు మండలం మొత్తం సిద్ధంగా ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఖాసీంపీరా అన్నారు. పెదనందిపాడులోని 5,6వ వార్డులలో శనివారం రాత్రి సిద్ధం పోస్టర్‌లను గడప గడపకు వెళ్లి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఖాశీంపీరా మాట్లాడుతూ సోమవారం మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడు జిల్లాలోకి ప్రవేశించనున్న నేపథ్యంలో విజయవంతం చేసేందుకు మండలంలోని పార్టీ శ్రేణులందరు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి రాష్ట్రప్రజల మన్ననలతో పాటు దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసే విధంగా జగనన్న పాలన చేసినట్లు ఆయన తెలిపారు. మాట ఇస్తే మడమతిప్పకుండా ఎన్ని ఇబ్బందులు ఎదురైన సకాలంలో పథకాలను ప్రజల వద్దకే అందించిన ఘనత జగనన్నదేనని ఆయన తెలిపారు. కూటమి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సిద్ధం పోస్టర్‌లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివి రాంబాబు, మండల ఉపాధ్యక్షుడు కమ్మా సాంబ శివరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు దివి నాగయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ మేడిద రవి కుమార్, గేరా గణేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంతరంగ సంస్కరణే అద్భుత ఔషధం



తాడేపల్లి రూరల్ : సమాజంలో అంతర్గతంగా జరుగుతున్న నేరాలన్నింటికీ మనుషుల అంతరంగంలో చోటు చేసుకుంటున్న విపరీత ధోరణులే ప్రధాన కారణమని మాజీ డీజీపీ డాక్టర్ ఎం. మాలకొండయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్గత భద్రత, సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాలకొండయ్య ప్రసంగిస్తూ.. మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు వంటి అంశాలను బూచిగా చూపి ఆ ముసుగులో నేరాలకు పాల్పడేవారు కొందరైతే, నేరాన్ని వృత్తిగా మలచుకొని జీవించేవారు ఇంకొందరన్నారు. ఇలాంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను సూచించారు. ఆరోగ్యవంతమైన శరీరంలోనే స్థిర చిత్రమైన మనసు ఉంటుందన్నారు. బీఏ ఏఏఎస్ విభాగాధిపతి డాక్టర్ బి. శివనాగయ్య మాట్లాడుతూ నేటి పోటీ పరీక్షల్లో అంతర్గత భద్రత అనే అంశం చాలా కీలకమైనదన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిశోర్‌బాబు, విభాగ ఉపాధిపతి డాక్టర్ కె. అనిల్ కుమార్, మునీశ్, డాక్టర్ ప్రజాపతి, ఆర్. సాయికుమార్ పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సదస్సు అట్టర్ ఫ్లాప్

- ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు
- సభకు జనాదరణ కరువు
- అసహనానికి గురైన నేతలు



బోసిపోతున్న సభ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరులో తెలుగుదేశం పార్టీ జయహో బీసీ సదస్సు తుస్సుమంది. స్థానిక నాయకులు, కార్యకర్తలు జనాన్ని తరలించడంలో విఫలకావడంతో నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఒకటీ ఆరా మాటలు మాట్లాడి, సభ నుంచి నెమ్మదిగా జారుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. 45వ డివిజన్ పరిధిలోని హనుమయ్యనగర్ వాటర్ ట్యాంక్ వద్ద టీడీపీ జయహో బీసీ సదస్సు ఈనెల 6న జరగనుందని కొద్ది రోజులుగా ప్రచారం చేస్తున్నారు. దీనికి తోడు స్థానిక నాయకులు, కార్యకర్తల్ని కూడా అప్రమత్తం చేశారు. సభకు పెద్దఎత్తున జనాన్ని సమీకరించాలని చెప్పారు. పశ్చిమ డివిజన్‌లోని మిగతా డివిజన్‌లకు సభ ఆదర్శంగా ఉండేలా చూడాలని సూచించారు. అయితే, శనివారం సాయంత్రం నిర్వహించిన సదస్సు జనాదరణలేక ఖాళీగా దర్శనమిచ్చింది. డివిజన్ పరిసర ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల మందికి పైగా హాజరవుతారని వేసిన అంచనా తలకిందులైంది. కేవలం 100 నుంచి 150 మంది మాత్రమే హాజరయ్యారు. పెద్దసంఖ్యలో కుర్చీలన్నీ కూడా ఖాళీగా కనిపించాయి. నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అరకొరగా ఉండటంతో వేదికపై ఉన్న నాయకులు అసహనానికి గురయ్యారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిని గల్లా మాధవి, ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని), నాయకులు నిమ్మల శేషయ్య తదితరులు మొక్కుబడిగా నాలుగు మాటలు చెప్పేసి, సభా వేదిక నుంచి నెమ్మదిగా జారుకున్నారు. ఇక జనాన్ని తరలించకపోవడంపై స్థానిక టీడీపీ నాయకులపై గల్లా మాధవి, నాని, శేషయ్య ఒకింత మండిపడ్డారని తెలిసింది. సభ నిర్వహణపై పలు ప్రాంతాల్లోని డివిజన్ నాయకులను అప్రమత్తం చేశామని, అయినప్పటికీ రాకపోవడంపై పార్టీపై సానుభూతిలేక పోవడమే కారణంగా తెలిసింది.

వైఎస్సార్ సీపీ నేత 'పాదర్తి'కి ఘన నివాళి



పాదర్తి రమేష్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నూరిఫాతిమా, నేతలు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాదర్తి రమేష్‌గాంధీ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ తూరు నియోజవకర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, స్నేహశీలిగా, మృదుస్వభావిగా గుర్తింపు తెచ్చుకున్న నేత పాదర్తి రమేష్‌గాంధీ అని కొనియాడారు. కొత్తపేట శివాలయం చైర్మన్ మొగిలి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నహీద్, కోట నరేంద్ర, కొత్త వెంకటేశ్వరరావు, పద్మనాభుని ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, ప్రమీలారాణి, బి. శివప్రసాద్, మునిరత్నం, శ్రీనివాసరెడ్డి, మహేష్‌బాబు, శ్రీనివాస్, సాయి, హేమంత్, కిశోర్, శ్రీనివాస్, నాని, గోపి పాల్గొన్నారు.

'గడప గడపకు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో రవీంద్రనాథ్ తదితరులు

నగరంపాలెం: సాహితీ ఉద్యమకారుడు వల్లూరు శివప్రసాద్ నాలుగు దశాబ్దాలుగా ఎన్నో చక్కని కథలు, నాటికలు రాశారని కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత అదనపు కమిషనర్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన కథలు హాస్యంతో పాటు ఆలోచింపజేసేలా ఉంటాయని చెప్పారు. వల్లూరు శివప్రసాద్ రచించిన 'గడప గడపకు' హాస్య, వ్యంగ్య కథా సంపుటి పుస్తక ఆవిష్కరణ సభ శనివారం రాత్రి బృందావన్ గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉత్తమ నాటక రచయితగా వల్లూరు శివప్రసాద్ ఆరుసార్లు రాష్ట్ర ప్రభుత్వ నంది బహుమతులు పొందారని తెలిపారు. కథా సంపుటిని ప్రముఖ సాహితీ విమర్శకురాలు సీహెచ్.సుశీల సమీక్షించారు. సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించగా, కొటక్ మహీంద్ర బ్యాంక్ విశ్రాంత అసోసియేట్ ఉపాధ్యక్షుడు పి.వీరారెడ్డి తొలి ప్రతిని అందుకున్నారు. అనంతరం రచయిత వల్లూరు శివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు వల్లూరు తాండవకృష్ణ, సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం నాయకులు టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్యచౌదరి, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకన కేంద్రం పరిశీలన

పెదకాకాని: పెదకాకాని రోడ్డులోని సెయింట్ జోసెఫ్ సీబీఎస్ఈ స్కూలులో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని శనివారం ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానంద రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పరీక్ష పత్రాల మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులను కలిసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులు ఏ విధమైన పొరపాట్లకు అవకాశం లేకుండా మూల్యాంకన ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలో కల్పించిన ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకట్‌రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖాధికారి బలిరాం, సీనియర్ ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్, ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రమేష్, సీఐలు

తెనాలిరూరల్: తెనాలి సబ్ డివిజన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు పోలీసులు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ ఎం.రమేష్ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని చెప్పారు. పరిమితికి మించిన ప్యాసింజర్‌లను ఎక్కించవద్దని సూచించారు. ఓవర్ స్పీడ్‌గా డ్రైవ్ చేయవద్దని, ట్రాఫిక్ ఎక్కడ పడితే అక్కడ అడ్డంగా ఉండే విధంగా వాహనాలను ఆపరాదని తెలిపారు. మద్యం తాగి ఆటోలు నడపకూడని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ఊరేగింపుల్లో ఆటోలను వినియోగించాల్సి వస్తే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని , లేనిపక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాల్లో డీజే సౌండ్ సిస్టమ్ పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. సమావేశంలో సీఐలు జి.దశరథరామారావు, ఎ.సుధాకర్, ఎస్.రమేష్‌బాబు, రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు స్వరలయ వేదిక ఉగాది వేడుకలు

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.